క్లుప్తంగా

సాగర్‌మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



విజయపురిసౌత్: దేవుని కృప వల్ల లోక రక్షకుడైన యేసుక్రీస్తుకు జన్మనిచ్చిన మరియతల్లి పరమ పవిత్రురాలిగా కీర్తి పొందారని సాగర్ మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్ మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజాలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. భక్తులు నిండు మనస్సుతో మరియతల్లిని ప్రార్థిస్తే ఆ తల్లి దీవెనలు అందిస్తుందన్నారు. అనంతరం సాగర్‌మాత దేవాలయం చుట్టూ భక్తులతో కలిసి ప్రదక్షణలు చేసి దివ్యసప్రసాద ఆశీర్వాదం అందజేశారు. దీనికి ముందు భక్తులు సాగర్‌మాత దేవాలయంలో కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి, తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, శంకర్ కంటి హాస్పటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 825 మంది హాజరు కాగా వీరిలో 500 మందికి శుక్లా ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు నిర్ధారించారు. వీరందరికి గుంటూరు దగ్గరలోని పెద కాకానిలో శంకర్ కంటి హాస్పటల్ వద్ద రోజుకు వంద మంది చొప్పున కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరందరికి భోజన సదుపాయంతోపాటు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కాకుమాను శ్రీనివాసరావు, సెక్రటరీ కోట రమేష్, ట్రెజరర్ ఉడతా రాము, డాక్టర్ విష్ణు, అసిస్టెంట గవర్నర్ పి. రమేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అనధికారికంగా ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

మాచవరం: మండలంలో పలు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ కొన్ని ప్రైవేట్ సంస్థలు ద్వారా అనధికారికంగా కొందరు వ్యక్తులు ఒక్కో కార్డుకు రూ.50 తీసుకుంటూ కార్డులు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని ఎవరూ తీసుకోవద్దని పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రవర్తి తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేనందున ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొనవద్దని తెలిపారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన కార్డులు ఉచితంగా ఇవ్వడం జరుగుతందని, విషయాన్ని మండల ప్రజలు గ్రహించాలని తెలియజేశారు.

గండి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల(యడ్లపాడు): నాదెండ్ల మండలం గణపవరం – చిలకలూరిపేట మార్గంలోని శివప్రియ నగర్ సమీపాన ఉన్న గండిపోచమ్మ దేవస్థాన వార్షిక వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను క్షేత్రం పీఠాధిపతి నిత్యవిద్యానంద భారతిస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. వార్షికోత్సవ రెండోరోజైన ఆదివారం పసుపుకొట్టే కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆదిపరాశక్తి అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

నరసరావుపేట టౌన్: క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం ఏరియా వైద్యశాల్లో చోటుచేసుకుంది. కారంపూడికి చెందిన మండవ నరసింహారావు(46) శనివారం పల్నాడు బస్టాండ్‌లో ఎలుకల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 సహాయంతో బాధితుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఒత్తిడిలేని బోధన అవసరం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

యడ్లపాడు: మానసిక ఒత్తిడి లేని విద్యావికాసమే పిల్లల్లో శాశ్వతంగా గుర్తుండిపోతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. స్థానిక బైరాగిబావి సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యావనం పాఠశాలను గ్రామ పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల బట్టీ విధానం, మార్కులు, ర్యాంకుల వెంట పరుగులు, గ్రేడ్ల సాధన కోసం కసరత్తు చేయడం వలన ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. విద్యార్థి జీవితాన్ని ఇవన్నీ ప్రభావితం చేయవని, సున్నిత అంశాలతో కూడిన సృజనాత్మక బోధన ఎంతో అవసరం అన్నారు. గురువులు ఈ దిశగా ఆలోచన చేసి బాలల భవితకు బంగారు బాటలు వేయాలని కోరారు.

మట్టి పరీక్షల ఆధారంగా పంటలు వేద్దాం

- పుడమి తల్లిని కాపాడుకోవడం ఎంతో అవసరం
- మట్టి పరీక్షల ఆధారంగా పంటలు వేసుకోవాలి
- సబ్ డివిజన్ పరిధిలో 49 వేల హెక్టార్లు సాగు భూమి



మాచవరం మండలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది(ఫైల్)

గురజాల : పల్నాడు ప్రాంతంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పుడమి తల్లిపై భారం వేసి కష్టాలు.. నష్టాలు వచ్చినా వ్యవసాయమే ప్రాధాన జీవనాధారం. ఏదో ఒక పంటలో లాభాలు రాకుండా పోతాయా అన్న చిన్న ఆశతో రైతులు ముందుకు సాగుతారు. పుడమి తల్లిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. భూసారాన్ని కాపాడుకుంటే మంచి దిగుబడితో పంటలు పండించ వచ్చిని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి సారవంతంగా ఉందా లేదా అని తెలుసుకునేందుకు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి మట్టి పరీక్షల ప్రాముఖ్యతను అధికారులు రైతులకు వివరిస్తున్నారు. రైతులు అధికంగా పురుగు మందులు వాడడం, ఎరువులు వాడడం వల్ల భూమిలో సారం మొత్తం పోయి భూమి చౌడు నేలలుగా మారిపోతున్నాయి. దీంతో దిగుబడి రాక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. సాగుకు పెట్టుబడి పెరిగిపోతుంది. రైతులు ప్రధానంగా రసాయనిక ఎరువులు వాడకం తగ్గించాలని అదే విదంగా మట్టి పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేయాలని అంటున్నారు.

మండలానికి 60 శాంపిల్స్...

పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని పిడుగురాళ్ల, నెకరికల్లు, దాచేపల్లి, మాచవరం, కారంపూడి మండలాలు ఉన్నాయి. ప్రతి మండలం నుంచి 60 శాంపిల్స్‌ను మట్టి నమూనా కేంద్రానికి పంపించేందుకు సిద్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో 49 వేల హెక్టార్లు వ్యవసాయం చేస్తున్నట్లు వ్యవసాయాధికారుల రికార్డుల్లో నమోదు అయింది. వేసవి కాలం ఏప్రిల్, మే, జూన్ నెలలు వ్యవసాయ భూములు ఖాళీగా కనిపిస్తాయి. వేసవి దుక్కులు దున్నడం భూయాజమాన్య చర్యలు చేపట్టడం వంటి పనులు చేస్తుంటారు. ఈ సమయంలో మట్టి నమూనాలు సేకరించి మట్టి పరీక్షలకు పంపి వచ్చిన ఫలితాల ఆధారంగా భూమిలో ఏ ఏ పోషకాలు లేకుండా పోయాయో తెలుసుకుని వాటిని భూ యాజమాన్య చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు.

మట్టి పరీక్షలు చేయిస్తే మంచిది

మట్టి పరీక్షలు చేయించుకుంటే ఎంతో మంచిది.భూమిలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని ఆ పోషకాల కోసం తీసుకోవల్సిన చర్యలు వ్యవసాధికారుల సలహా తీసుకోవడం మంచిది. ఇప్పటికే మట్టి నమూనాలు సేకరించడం జరిగింది. మెట్ట 5 ఎకరాలకు ఒక శాంపిల్, మాగాణి 2.5 ఎకరాలకు ఒక శాంపిల్ తీసుకుంటున్నాము. మట్టి పరీక్షలు చేయడం వల్ల లాభాలే కానీ నష్టాలు ఏ మాత్రం ఉండవు. రైతులు అధికారులకు సహకరించి మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి.

– శ్రీ కృష్ణదేవరాయులు, పిడుగురాళ్ల ఏడీఏ

అ‘పూర్వ’ కలయిక



నాడు విద్య నేర్పిన గురువులతో

మాచవరం: 25 ఏళ్ల నాటి స్నేహానుబంధం ఒక్కటైన వేళ....నాటి గురువుల బోధనలు..తీపి గుర్తులు అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ అమరికలు లేని చిన్ననాటి స్నేహాన్ని నెమరవేసుకుంటూ మాచవరం జెడ్పీ హైస్కూల్ 1993–98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సహాల మధ్య జరిగింది. చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు సుమారు రూ.12 లక్షలతో భోజనశాల నిర్మాణం చేపట్టి, విద్య నేర్పిన గురువుల చేతుల మీదగా ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తమ వ్యక్తిగత పరిచయం చేసుకుంటూ, ఉద్యోగ, వ్యాపార, నేటి జీవన విధానాలను తోటి మిత్రులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ నాడు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి, నేడు ఉన్నతంగా ఎదిగిన విద్యార్థుల ఆకాంక్షలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి భోజనశాల నిర్మించడాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరు విద్య నేర్చుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు తమ వంతుగా అభివృద్ధికి పాటుపడాలని కోరారు.



పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన భవనం

నేటి నుంచి ఒంటిపూట బడులు

మాచర్ల: పట్టణం, మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలను సోమవారం నుంచి ఒంటి పూట బడులను ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించాలని మండల విద్యా శాఖాధికారి వేముల నాగయ్య ఆదివారం తెలిపారు. ప్రతి ఒక్క పాఠశాల వారు నేటి ఉదయం 7.30గం''ల నుంచి 11.30గం''ల వరకు పాఠశాల నిర్వహించి అనంతరం విద్యార్థులను ఎండ తగలకుండా ఇళ్ళకు పంపించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 11.30గం''ల నుంచి మధ్యాహ్నం 12గం''ల మధ్య భోజనం అందించాలన్నారు. ఈ విషయంలో ఎక్కడా రాజీపడవద్దని, అనంతరం ఎక్కువ సమయం తీసుకుని పాఠశాలను నడిపితే తీవ్ర చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

నేడు స్పందన

గురజాల : స్థానిక డీఎల్‌డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డీఎల్‌డీఓ గఖ్రునాయక్ తెలిపారు. మండలాల పరిధిలోని గ్రామాల్లో ఏమైనా పంచాయతీలకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. రెవెన్యూ పరంగా సమస్యలు ఉంటే ఆర్డీఓ కార్యాలయానికి సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ కోరారు.

రామకృష్ణ సేవా సమితి సేవలు అభినందనీయం



వివేకానంద అనాథ వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో వృద్ధులు, అనాథలను ఆదుకునేందుకు అనేక సంవత్సరాలుగా రామకృష్ణ సేవా సమితి పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి కోసం లక్షల రూపాయల వ్యయంతో అనాథలు, వృద్ధుల కోసం ఆశ్రయం కల్పించడం ఎంతో అభినందించ దగ్గ విషయమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణ శివారులోని శ్రీశైలం రోడ్డులో వివేకానంద స్వామి పేరుతో నిర్మించిన అనాథాశ్రమాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించి మాట్లాడుతూ రామకృష్ణ సేవా సమితి జిల్లా స్థాయి కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్ళడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనాథాశ్రమంలో భాగస్వామ్యమై తనవంతుగా అనాథాశ్రమ, వృద్ధుల ఆశ్రమానికి అదనంగా రూ. 5లక్షలు కేటాయించినట్లు ప్రభుత్వ విప్ పీఆర్కే తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలుంటాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గట్ల కోటిరెడ్డి, రామాంజనేయరెడ్డి, సమితి సభ్యులు ఆర్టీసి వెంకటేశ్వరరెడ్డి, ఎం శ్రీనివాసరావు, చంద్రయ్యతో పాట పలువురు పాల్గొన్నారు.

పంట పొలాల రోడ్లకు మరమ్మతులు



టిప్పర్‌కు మట్టిని లోడ్ చేస్తున్న ప్రొక్లెయినర్

కారెంపూడి: నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో మండలంలోని మిరియాల గ్రామ రైతులు పొలం బాటలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా ఆదివారం కూడా రైతులు ఉత్సాహంగా పనులు చేయిస్తున్నారు. ఎంపీ పంపిన పొక్లెయినర్, జేసీబీ, టిప్పర్లతో రైతులు పొలం బాటలను రైతులు అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు పది పొలం బాటలకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు తొలగించి బాటలను వెడల్పు చేసి చదును చేశారు. వాటిలో నాలుగు రోడ్లకు గ్రావెల్ కూడా తోలి చదును చేస్తూ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. చర్లగుడిపాడు పొలిమేర నుంచి మిరియాల హైస్కూల్ వరకు ఐదు కిలో మీటర్ల బాటకు అలాగే చర్లగుడిపాడు మేజర్ కాల్వ నుంచి మిరియాల గ్రామం వరకు, చర్లగుడిపాడు కుంట దగ్గర నుంచి గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు, నరమాలపాడు డొంక నుంచి వైఎస్సార్ జగన్న కాలనీ లే అవుట్ వరకు ఉన్న పొలం బాటలకు గ్రావెల్ పరచి చదును చేయించే పనులు జరుగుతున్నాయి. ఇంత వరకు ఎప్పుడు కూడా పొలం బాటలను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని తొలిసారిగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి ఈ పనులు చేయిస్తున్నారని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పొలం బాటలు బాగా లేక పొలం వెళ్లడానికి నానా బాధలు పడేవారమని, పొలం దాకా ఎడ్ల బండ్లు కూడా పోలేని పరిస్థితి ఉండేదని ఇప్పుడు ఆ సమస్యలన్నీ ఇప్పుడు పరిష్కారం అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డిలకు రైతులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఈ రోజుల్లో రైతుల సమస్యలు గుర్తించే ఇలాంటి మంచి ఆలోచన గల ప్రజా ప్రతినిధులు ఉండడం చాలా గొప్ప విషయమన్నారు. ఇదిలా ఉంటే ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పంపిన యంత్రాలతో పాటు గ్రామంలో ఉన్న రైతులు కూడా తమ ట్రాక్టర్లుతో ఉత్సాహంగా పనుల్లో పాలుపంచుకుంటున్నారు.

మండుతున్న ఎండలు



వెలవెలబోతున్న మాచర్ల ప్రధాన రహదారి

మాచర్ల: పట్టణంలోని రోహిణీ కార్తె ముగిసినా ఎండలు మండుతున్నాయి. ఆదివారం 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9గం''ల నుంచి ఎండలు తీవ్రంగా కాశాయి. ఆదివారం సెలవుదినం కావడంతో ఎండలు చూసి భయపడిన జనం ఇళ్ల నుంచి బయటకు రాకుండానే కాలం గడుపుతున్నారు. దీంతో మాచర్ల – గుంటూరు, శ్రీశైలం, సాగర్, నర్సరావుపేట రహదారులన్నీ వెలవెలబోయాయి. సాగర్ మాతకు తరలివెళ్ళిన భక్తులు తప్ప రోడ్డు పై ప్రజలెవ్వరూ లేరు. ఎక్కడికక్కడ రోడ్లన్నీ ప్రజల రాకపోకలు లేక ఎటుచూసినా రోడ్డు పై జన సంచారం కనబడలేదు. వారం రోజులుగా ప్రజలు ఎండలెక్కువై ఇబ్బందులు పడుతున్నారు. శీతల పానియాలు, జ్యూస్ బండ్లు, కొబ్బరి బోండాల కొట్ల వద్ద, సాయంత్రం 6గం''ల తరువాత ప్రజలు బారులు తీరారు.

ఏపీ మోడల్‌స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

- ఆరో తరగతికి 100 సీట్లకు 108 దరఖాస్తులు
- అర్హత పరీక్షలకు మాత్రం 77 మంది హాజరు



ఆరోతరగతి ప్రవేశ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నాదెండ్ల(యడ్లపాడు): ఏపీ ఆదర్శ పాఠశాలల 2023–24 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం అర్హత పరీక్షకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ మోడల్ స్కూళ్లలోనే ఆయా పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ప్రతి పాఠశాలలోనూ వందసీట్ల భర్తీ కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రవేశ పరీక్షను నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో ఈ రాత పరీక్షను పాఠశాల కార్యదర్శి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆరో తరగతి ప్రవేశాలకు వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 108 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 77 అర్హత పరీక్షకు హాజరైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తెలిపారు.

వి.రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌లో...

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండలంతో పాటు నకరికల్లు, ఈపూరు తదితర మండలాల నుంచి మొత్తం 203 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 185 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. పరీక్షను పరిశీలించిన ప్రిన్సిపాల్ బి.రవినాయక్ మాట్లాడుతూ 6వ తరగతి ప్రవేశ పరీక్ష 5వ తరగతిలో ఉన్న అన్ని సబ్జెక్టులలో సిలబస్‌కు సంబంధించి 100 మార్కులకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఓఎంఆర్ విధానంలో పరీక్ష జరిగిందన్నారు. విద్యార్థుల ప్రశ్నాపత్రాలను హెడ్ ఆఫీసుకు పంపటం జరుగుతుందన్నారు. పరీక్షలలో వచ్చిన మార్కులను పరిశీలించి, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం తమ పాఠశాలలో సీట్లు కేటాయించటం జరుగుతుందన్నారు.

ఈ స్నేహబంధం.. ఇలానే కొనసాగిద్దాం



లింగారావుపాలెంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

యడ్లపాడు: పలు గ్రామాలకు చెందిన వారంతా 30 ఏళ్ల క్రితం యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఉద్యోగం, వ్యాపారం, వివాహం నిమిత్తం సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోని తాము చదివిన పాఠశాల ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో 1993–94 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 50 మంది కలిసి సమావేశం అయ్యారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సంతోషంగా గడిపారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించారు. ఇకపై ఏటా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని తప్పక తమ స్నేహబంధాన్ని ఇలానే కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనానికి శ్రీకారం చుట్టిన పూర్వ విద్యార్థిని, అప్పటి ఉపాధ్యాయుడు మోహన్‌రావు మాస్టారు కుమార్తె అన్నపనేని లావణ్య, నంబూరి పావనిలను ఆబ్యాచ్‌లోని విద్యార్థులు అభినందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా సాగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫలించిన ఎన్నో ఏళ్ల నిరీక్షణ


- ఎస్‌జీటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు
- 25 ఏళ్ళ కలను నిజం చేసిన జగనన్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

మాచర్ల రూరల్: ఉద్యోగ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఆన్‌లైన్‌లో పారదర్శకంగా జరగడంతో పాటు 25 సం''రాల నుంచి ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు రావడంతో ఉపాధ్యాయులు ఆనందంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బదిలీలంటే సుదూర ప్రాంతమైన జిల్లా కేంద్రాలకు వెళ్లి వ్యయ ప్రయాసలకోర్చి గంటల తరబడి వేచి ఉండి బదిలీల్లో ఉత్కంఠభరితంగా ఉండేది. తమ సీనియారిటీ జాబితాకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో తమకు ప్రదేశాన్ని ఎన్నుకుని నమోదు చేసి వారు అనుకున్న ప్లేసులోనే పదోన్నతులు రావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మారిన నూతన విద్యా విధానానికి అనుగుణంగా జరిగిన మార్పుల్లో అర్హత ఉన్న సెకండ్ గ్రేడ్ టీచర్లకు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు అందుకుంటున్నారు. మాచర్ల నియోజక వర్గంలోని వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, రెంటచింతల, మాచర్ల మండలాలకు చెందిన సుమారు 60 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు అందుకుని ఆయా పాఠశాలలో చేరారు. జగనన్న నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టడంతో వెనుకబడిన పల్నాటి ప్రాంతంలోని ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది...



ఎన్నో సంవత్సరాల నుంచి ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న మాకు స్కూల్ అసిస్టెంట్‌గా రావడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు మంచి విద్యనందించి వారి ఉన్నత భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు మా వంతుగా కృషి చేస్తాం.

– గరిక పద్మ, దుర్గి, జెడ్పీహెచ్ఎస్.


ప్రతి సంవత్సరం ఎదురు చూశాం...



ప్రతి సంవత్సరం పదోన్నతి కోసం ఎదురు చూసే మాకు జగనన్న ప్రభుత్వం ప్రమోషన్ ప్రకటించడం సంతోషకరం. పదోన్నతి త్వరగా రావడం ఎంతో ఆనందకరంగా ఉంది. విద్యార్థులకు చక్కని విద్యనందించి వారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తాం.

– భారతి ఫ్లొరెన్స్, దుర్గి, జెడ్పీహెచ్ఎస్.

ఎన్నో ఉద్యమాలు...



గతంలో ప్రమోషన్ల కోసం ఎన్నో ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించినా స్పందించే వారు కాదు. ఈ ప్రభుత్వం నూతన విద్యా విధానాల ద్వారా అర్హత కలిగిన వారందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషను అందించడం ఉపాధ్యాయుల్లో ఆనందకరంగా ఉంది.

– జి చిన అనంతరామయ్య

పారదర్శకంగా ప్రమోషన్లు...



ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ప్రతి సంవత్సరం ప్రమోషన్ కోసం ఎదురుచూస్తుండేవాళ్ళం. ఈ ప్రభుత్వం పారదర్శకంగా అర్హత ఉన్న అందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు అందించడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్యను చక్కగా బోధించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తాం. – డి. విజయ ప్రశాంతి కుమారి, ఓబులేశునిపల్లె, జెడ్పీహెచ్ఎస్

వేసవిలో దుక్కులు లోతుగా దున్నుకోవాలి

ముప్పాళ్ళ: వేసవిలో దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలని, వాలుగా అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు, పంట కోత దశల్లో నిద్రావస్థ దశలో ఉంటాయి. తెగుళ్ళను కలుగ చేసే శిలీంధ్రాలు తదితరమైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. లోతుగా దుక్కులు దున్నడం వల్ల భూమిలోని చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు, గుడ్లను, పక్షులు, కొంగలు, కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. లోతుగా దున్నడం వల్ల శిలీంధ్ర బీజాలు మట్టితో పాటు పైకి వస్తాయి. బయట అధిక ఉష్ణోగ్రతలకు అవి చనిపోతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారవుతుంది. ఫలితంగా భూసార వృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతుంది. లోతు దుక్కులతో భూమి పై పొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. ఇలా భూమిలో తేమ శాతం పెరిగి, భూసారం అభివృద్ధి, పురుగుల, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ వగైరా ప్రయోజనాలు సమకూరతాయి. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినట్లయితే పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడు కోవచ్చన్నారు.